

29న పాలకొల్లులో ఎల్ఐసి ఉద్యోగుల మహాసభ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 29న పాలకొల్లులో జరగబోయే రాజమండ్రి డివిజన్ 28వ మహాసభలో ఎల్ఐసి క్లాస్-3, 4 ఉద్యోగులు 350 మంది పాల్గొనున్నారని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ తెలిపారు. ఈ మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక ఎల్ఐసి బ్రాంచి కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఆవిష్కరించారు. ఈ మహాసభలో హైదరాబాద్ నుంచి జోనల్ ఫెడరేషన్ నాయకులు రవీంద్రనాథ్, పి.సతీష్, కిషోర్ కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఎల్ఐసిలో చాలాకాలంగా ఖాళీగా ఉన్న క్లాస్-3, 4 ఉద్యోగాల భర్తీ, నూతన పెన్షన్ పథకం రద్దు చేసి 1995 పెన్షన్ పథకం అమలు తదితర అంశాలపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో మాథ్యూస్, సత్యదేవా, సమ్మతం గనెయ్యా, విశ్వనాథ్, మురళీకృష్ణ, కె.సురేంద్రన్, జగదీష్, నగేష్, మూర్తి, విజయకుమార్, ప్రసాద్, నాగరాజు, కనకదుర్గ, సుశీల, దుర్గాభవాని పాల్గొన్నారు.

పంచాయతీ రిజర్వేషన్లపై ఉత్కంఠ..!



రిజర్వేషన్లు అనుకూలంగా చూడాలని ఎంఎల్ఎల వద్దకు నేతల క్యూ

అభ్యర్థుల ఎంపికపై నాయకుల కసరత్తు

ఎన్నికలపై సిఎం వ్యాఖ్యలతో గ్రామాల్లో హడావిడి

ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 409 పంచాయతీలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. రిజర్వేషన్ల కేటాయింపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న కేటగిరిని బట్టి రిజర్వేషన్ ఏవిధంగా వస్తుందో ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. కీలకమైన పంచాయతీలకు సంబంధించి రిజర్వేషన్లు అనుకూలంగా వచ్చేటట్లు చూడాలని స్థానిక నేతలు ఎంఎల్ఎల వద్దకు క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పలుచోట్ల బిసి, ఎస్‌సిలకు కేటాయించాల్సిన స్థానాలను జనరల్‌కు కేటాయించే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా మేజర్ పంచాయతీలపై స్థానిక నేతలు తమకు అనుకూలంగా రిజర్వేషన్ల కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంఎల్ఎలు సైతం స్థానిక నేతలకు రిజర్వేషన్లపై భరోసా ఇస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల వాతావరణం నెలకొంది. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 409 పంచాయతీలు ఉన్నాయి. 2020 మార్చి నాటికి పంచాయతీ ఎన్నికలు విడతలవారీగా పూర్తయ్యాయి. ఐదేళ్ల కాలం పూర్తవుతుండటంతో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించాలని ప్రభుత్వం చూస్తున్నట్లు సంకేతాలు ఉన్నాయి. గడిచిన సెప్టెంబర్ మూడో తేదీన ప్రీ ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. అందులో పేర్కొన్న షెడ్యూల్ ప్రకారం ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు. గడిచిన బుధవారం సిఎం చంద్రబాబు పార్టీ నాయకులు, కార్యకర్తలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో మూడు, నాలుగు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో ఉంటూ ఎన్నికలకు సిద్ధం కావాలంటూ సూచించారు. దీంతో పంచాయతీ ఎన్నికలను వెంటనే నిర్వహించే అవకాశం ఉందనే అంచనాలు నెలకొన్నాయి. దీంతో పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో హడావిడి మొదలైంది. అభ్యర్థిగా ఎవరిని నిలబెట్టాలనే కసరత్తు ప్రారంభించారు. జనరల్‌కు వస్తే ఎలా, బిసి, ఎస్‌సి రిజర్వేషన్ వస్తే ఎవరిని బరిలో దింపాలనే ప్రణాళికలు వేస్తున్నారు. ప్రస్తుతం బిసి రిజర్వేషన్లు కొనసాగుతున్న చోట ఎస్‌సిలకు కాకుండా జనరల్‌కు వచ్చేలా చేయాలని స్థానిక నాయకులు ఎంఎల్ఎలను కలుస్తున్న పరిస్థితి ఉంది. దీంతో రిజర్వేషన్లను ఇష్టానుసారంగా మార్చే అవకాశం ఉందా అంటూ బిసి, ఎస్‌సి నేతలు ఆరా తీస్తున్న కన్పిస్తోంది. ఒకవేళ రిజర్వేషన్ అనుకూలంగా రాకపోతే ఏం చేయాలనే లెక్కలు సైతం వేస్తున్నారు. రిజర్వేషన్ కోటా మహిళలకు వస్తే ఎవరిని నిలబెట్టాలనే చర్చలు సైతం సాగుతున్నాయి. జనవరిలో జనాభా లెక్కల ప్రక్రియ మొదలు కానుంది. అందుకు సంబంధించి కేంద్రం నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. దీంతో జనాభా లెక్కలు పూర్తయిన తర్వాత పంచాయతీ ఎన్నికలు ఉంటాయా.. సమాంతరంగా ఎన్నికల ప్రక్రియ సాగుతుందా అనే చర్చ సైతం నడుస్తోంది. ప్రీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తే డీలిమిటేషన్ ప్రక్రియ, రిజర్వేషన్ల ఖరారు, వార్డులవారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయడం, రిటర్నింగ్ అధికారులను నియమించడం, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు వంటి ప్రక్రియ సాగాల్సి ఉంటుంది. జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకూ సమయం ఉంది. అప్పటి వరకూ ఆగి పంచాయతీ, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలను ఒకేసారి నిర్వహిస్తారా.. లేక పంచాయతీ ఎన్నికలను మార్చిలోపే జరిపేస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఏదేమైనప్పటికీ గ్రామాల్లో మాత్రం పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంది.

రిజర్వేషన్ మారినా పెత్తనం చేసేలా ప్రణాళికలు

పలు కీలకమైన పంచాయతీలకు సంబంధించి జనరల్ కేటగిరికి వచ్చే విధంగా చేయాలని స్థానిక నేతలు ఎంఎల్ఎలకు చెబుతున్నారు. ఒకవేళ అలా జరగకపోతే పంచాయతీలో పెత్తనం పోకుండా ప్రణాళికలు సైతం రచిస్తున్నారు. ఎస్‌సి, బిసి కేటగిరికి వస్తే వార్డు మెంబర్‌గా గెలిచి వైస్ ప్రెసిడెంట్ పదవి దక్కించుకుని పంచాయతీపై పెత్తనం చేసేలా పలు గ్రామాల్లో నేతలు ఆలోచనలు సైతం చేస్తున్నారు. బిసి, ఎస్‌సి అభ్యర్థులు గెలిచిన చోట సైతం తామే చక్రం తిప్పేలా వ్యూహాలు రచిస్తున్నారు. జనరల్ కేటగిరి కోటా వస్తే ఖర్చు భారీగా ఉంటుందని, అదే బిసి, ఎస్‌సి కేటగిరికి వస్తే తక్కువ ఖర్చు అవుతుందని, వైస్ ప్రెసిడెంట్ పదవి దక్కించుకుని పెత్తనం చేయవచ్చుననే లెక్కలు సైతం మరికొందరు నేతలు వేస్తున్నారు. రిజర్వేషన్ల కేటాయింపును తమకు అనుకూలంగా చేసుకుని ముందుకు సాగాలనే యోచనలో నేతలు ఉన్నట్లు కనిపిస్తోంది. రిజర్వేషన్ల ప్రక్రియలో అధికారులు ఏవిధంగా ముందుకు సాగుతారో వేచిచూడాలి.



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

మత్స్యకారుల స్థితిగతులను మెరుగుపరుస్తాం

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

మత్స్యకారుల జీవన ప్రమాణాలు, స్థితిగతులు, సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చి వారి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకొస్తామని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేన కార్యాలయం వద్ద జరిగిన సభకు ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ మత్స్య సంపద వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రత్యేకంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏటా ప్రభుత్వాలు కోట్లాది రూపాయల ఆదాయాన్ని మత్స్య సంపద ఎగుమతుల వల్ల అర్జిస్తుందన్నారు. ఈ సంపదను వేటాడుతున్న మత్స్యకారులకు మరింత అండగా ఉండాలనే లక్ష్యంతో ఎన్‌డిఎ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను రూపొందించిందన్నారు. నరసాపురం తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతోపాటు తీర ప్రాంతం గుండా వెళ్తున్న 216 రహదారిని నాలుగు లైన్లుగా అభివృద్ధి చేస్తామన్నారు. దీని వల్ల మత్స్యకారులు ఎక్కువగా నివసించే తీర ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటాయన్నారు. నరసాపురంలోనే ఆక్వా యూనివర్సిటీని కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 217 జిఒను కూడా రద్దు చేశామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభానికి గత ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. జగన్ పాలన వల్ల రాష్ట్రం నుంచి 400 కంపెనీలు తరలిపోయాయన్నారు. మంచి చేసే ప్రభుత్వాలకే ప్రజలు పట్టంగట్టాలన్నారు. మత్స్యకారులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో కొత్తగా మరికొన్ని గురుకుల పాఠశాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీ పాకా సత్యనారాయణ మాట్లాడుతూ తీర ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయన్నారు. దీనివల్ల మత్స్య సంపద హరించిపోయే ప్రమాదం ఉందన్నారు. విప్, ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ తీర ప్రాంతంలో హార్బర్ నిర్మాణం చేపట్టి మత్స్యకారుల జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకొస్తామన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. దానికి అనుగుణంగా మత్స్యకారుల పిల్లలు ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ సలహాదారులు ఎంఎ.షరీఫ్, మత్స్యకార అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, వడ్డే కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మి, మాజీ ఎంఎల్ఎలు బండారు మాధవనాయుడు, కొత్తపల్లి జానకీరామ్, టిడిపి ఇన్‌ఛార్జి రామరాజు మాట్లాడుతూ మత్స్యకారులకు రాజకీయంగా గుర్తింపునిచ్చి వారి అభివృద్ధి, సంక్షేమాలకు అనేక పథకాలు అమలు చేసిన ఘనత కూటమికి దక్కుతుందన్నారు. అనంతరం రూ.1.70 కోట్లు విలువ చేసే వేట సామగ్రి, బోట్లు, ఆటోలు సబ్సిడీపై మత్స్యకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైలా వసంతరావు, ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఆక్వా యూనివర్సిటీ ఒఎస్‌డి టి.సుగుణ పాల్గొన్నారు.

ఆచంటలో బస్టాండ్ నిర్మించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్

ప్రజాశక్తి - ఆచంట

నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం తలుపూరి బుల్లబ్బాయి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథి గోపాలన్ మాట్లాడుతూ ఆచంటలో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నానావస్థలు పడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ప్రయాణికుల అవస్థలు తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రయాణికుల రద్దీని గమనించి జిల్లా కేంద్రమైన భీమవరం నుంచి ఆచంట మీదుగా కోడేరు వరకు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పి.మోహన్‌రావు, నేతలు ఎస్‌విఎస్.శర్మ, కుసుమే జయరాజు, మచ్చ సుబ్బారావు, గుత్తుల రంగారావు, మట్టపర్తి బాలవీరాంజనేయులు, బండి రంగారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేతా గోపాలన్

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిరసిస్తూ సదస్సు

23న పాలకొల్లులో నిర్వహణ : మెడికల్ కళాశాలల జిల్లా పరిరక్షణ కమిటీ

ప్రజాశక్తి - భీమవరం

పిపిపి పేరుతో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిరసిస్తూ ఈ నెల 23న పాలకొల్లులో సదస్సు నిర్వహిస్తున్నట్లు మెడికల్ కళాశాలల జిల్లా పరిరక్షణ కమిటీ నాయకులు యర్రా అజయ్‌కుమార్, టి.ప్రసాద్, కె.క్రాంతిబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పిపిపి పేరుతో మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించడం తగదని పేర్కొన్నారు. అదే జరిగితే పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మెడికల్ విద్య కలగానే మిగులుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 23న ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర బృందం పాలకొల్లు మెడికల్ కళాశాల ప్రాంతాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు ది.పాలకొల్లు కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ హాలులో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు, విద్యావేత్తలు, మేధావులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో తోలేరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వీరవాసరం

69వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17, అండర్-19 నెట్‌బాల్ పోటీల్లో తోలేరు హైస్కూల్ విద్యార్థులు ఆరుగురు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గెడ్డం కిషోర్‌కుమార్ తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను స్కూల్ యాజమాన్యం శుక్రవారం అభినందించింది. విజయవాడ పటమట హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు జరిగిన అండర్-17 బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టులో వాసంశెట్టి ఇందుజా, వీరవల్లి లావణ్య, జక్కంశెట్టి భవ్యశ్రీ ప్రథమ స్థానం సాధించారు. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టులో కడలి దుర్గాగణేష్, మేక సంతోష్ రాణించి ద్వితీయ స్థానం సాధించారు. ఏలూరు జిల్లా ధర్మాజీగూడెం క్రిసాలిస్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 15 నుండి17వ తేదీ వరకు జరిగిన అండర్-19 స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో తోలేరు హైస్కూల్ విద్యార్థిని వేండ్ర రమ్యశ్రీ పశ్చిమగోదావరి జిల్లా జట్టులో గోల్ అటాకర్‌గా రాణించి ద్వితీయ స్థానం సాధించినట్లు పీడీ పూడి శ్రీనివాస్ తెలిపారు. జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు తోలేరు స్కూల్ నుండి మేక సంతోష్, వీరవల్లి లావణ్య ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విజేతలను పీడీని గ్రామ సర్పంచి వేండ్ర లీలా వెంకటకృష్ణ, ఎంపిపి వీరవల్లి దుర్గ భవాని, ఉపసర్పంచి భోగిరెడ్డి శ్రీనివాస్, ఎస్ఎంసి ఛైర్‌పర్సన్ ముత్యాల పద్మ, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు.



విజేతలైన క్రీడాకారులతో స్కూల్ యాజమాన్యం

ముగిసిన సాగర్ కవాచ్

ప్రజాశక్తి - నరసాపురం

డిఎస్‌పి జి.శ్రీవేద ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన సాగర్ కవాచ్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. సముద్రతీరం వెంబడి ఉగ్రవాదుల రాకను పసిగట్టే ప్రయత్నంలో భాగంగా శుక్రవారం మెరైన్ పోలీసులు, పోలీసులు జిల్లాలో తీరం వెంబడి గస్తీ నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, పంటు రేవు, ప్రభుత్వాసుపత్రి, ఒఎన్‌జిసి, టెంపుల్ ల్యాండ్ బస్టాండ్ ఆవరణలో పోలీసులు గస్తీ నిర్వహించారు. అనుమానితుల బాగ్‌లు, వాహనాలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అంతర్వేది మెరైన్ ఎస్ఐ సోమశేఖర్ రెడ్డి, ఎఎస్ఐ ఫాతిమా, సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

ఎపి నిట్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ సందీప్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎపి నిట్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ వి.సందీప్ తెలిపారు. స్థానిక ఎపి నిట్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రంథాలయ ఛైర్మన్, ఆచార్యులు డాక్టర్ కార్తికేయశర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ సమాజ పురోభివృద్ధికి జ్ఞానమే మూలమని తెలిపారు. పుస్తక పఠనంతో మేధోశక్తి పెరుగుతుందని, విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయాన్ని గ్రంథాలయానికి కేటాయించాలని సూచించారు. అకడమిక్ డీన్ డాక్టర్ ఎన్.జయరామ్ మాట్లాడుతూ గ్రంథ పఠనం ద్వారానే జ్ఞానం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. విద్యార్థుల జీవన ప్రగతి, పూర్వ విద్యార్థులు, అంతర్జాతీయ సంబంధాలు డీన్ డాక్టర్ జిబి.వీరేశ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలని వివరించారు. అనంతరం బుక్ రివ్యూ కాంపిటేషన్, బుక్ ట్రెజర్ హంట్, పోస్టర్ ప్రజెంటేషన్ ఆన్ లైబ్రరీ థీమ్ వంటి పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు హర్ష్ మిశ్రా, సౌరబ్‌సింగ్, యశ్వినిరెడ్డి, శ్రీకరి, దీక్షిత, మన్మథ బహుమతులు, జ్ఞాపికలతోపాటు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ కమల మహంతి, సూపరింటెండెంట్ గోపాలకష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిట్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ సందీప్

కౌలు రైతులకు అన్యాయం

కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

కూటమి ప్రభుత్వం భూస్వాములకు కొమ్ముకాస్తూ కౌలు రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించే కౌలురైతులను పట్టించుకోకుండా అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయాన్ని ఏ శ్రమా చేయని భూస్వాములకు, భూయజమానులకు వేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని కౌలు రైతులను పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఎన్నికలకు ముందు తప్పుడు వాగ్దానాలు చేసి కౌలురైతులను నిలువునా మోసం చేశారని విమర్శించారు. కష్టపడి పంటలు పండించే రైతులను, శ్రమచేసి సంపద సృష్టించే శ్రామిక ప్రజలను పట్టించుకోకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమంటే ఇదేనా అని ప్రశ్నించారు. వ్యవసాయ రంగంలో గాలి మేడలు కట్టడం మాని వాస్తవంగా మోకాలి లోతు మట్టిలో పంటలు పండించే కౌలు, పేద రైతులను గుర్తించి తక్షణం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఇవ్వాలని, పంట నష్టం, పంటల బీమా కౌలురైతులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆహ్లాదకర వాతావరణానికి కృషి : డిపిఒ

ప్రజాశక్తి - ఉండి

గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రామనాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఉండి మండలం కలిసిపూడిలో నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ మాస్ శానిటేషన్ కార్యక్రమాన్ని రామనాథ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారాన్ని తొలగించి సంపూర్ణ పారిశుధ్య రహిత గ్రామాలుగా నిలపాలన్నారు. తడి చెత్త పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, పొడి చెత్తను రీసైక్లింగ్ చేసి పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు వినియోగించాలని అన్నారు. తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విధిగా నిర్వహిస్తే గ్రామాల్లో పారిశుధ్య సమస్యను అరికట్టవచ్చని, ప్రతిఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించొచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్, గ్రామ సర్పంచి కేసబోయిన జానకి శ్రీనివాస్ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిపిఒ రామనాథ్ రెడ్డి

నరసాపురంలో టిడిపి గ్రీవెన్స్

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు స్వీకరించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని తక్షణం పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మహిళ కమిషన్ మాజీ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి, నరసాపురం మండలాధ్యక్షులు వాతాడి ఉమామహేశ్వరరావు, రాంబాబు, పాపారావు పాల్గొన్నారు.

తణుకు నియోజకవర్గానికి గోదావరి జలాలు

ధవళేశ్వరం నుంచి పైప్‌లైన్ ద్వారా తరలింపు

దువ్వలో భూమి పూజ చేసిన ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

తణుకు నియోజకవర్గ ప్రజలకు గోదావరి జలాలు పూర్తిస్థాయిలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇందుకోసం ధవళేశ్వరం నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు తరలించేందుకు ప్రణాళికలు చేసినట్లు వెల్లడించారు. దువ్వ గ్రామంలో శుక్రవారం ఈ పథకానికి సంబంధించి భూమి పూజ చేసి ఎంఎల్ఎ మాట్లాడారు. రూ.54 కోట్లతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో మొత్తం 48 గ్రామాలకు ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. దీనిద్వారా 154 కిలోమీటర్ల మేర పైపులైన్లు నిర్మించడంతోపాటు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణం జరుగుతుందన్నారు. అనంతరం దువ్వ గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. దువ్వ గ్రామాన్ని స్వచ్ఛభారత్‌లో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టి పూర్తిస్థాయిలో గ్రామాన్ని పారిశుధ్య నిర్వహణ చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అన్ని వర్గాలకూ సమన్యాయం చేసే విధంగా అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తున్నామని ఎంఎల్ఎ చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

5,21,395 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాకు 5,51,332 స్మార్ట్ రైస్ కార్డులు జారీ కాగా ఇప్పటివరకూ 5,21,395 స్మార్ట్ రైస్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ఆగస్టు నుంచి ఇప్పటివరకు డీలర్స్ ద్వారా 5,2,395 స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన 29,937 స్మార్ట్ రైస్ కార్డులు జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. స్మార్ట్ కార్డులు పొందని లబ్ధిదారులు సంబంధిత తహశీల్దార్ కార్యాలయానికి నేరుగా వెళ్లి ఈ నెల 24వ తేదీ సాయంత్రం లోపు తీసుకోవాలని అన్నారు. అలా తీసుకోకుండా మిగిలిన లబ్ధిదారుల కార్డులను ప్రభుత్వానికి అప్పగించడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న జెసి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత ఉండాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్‌వి‌ఎస్.ప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని నాలుగో వార్డులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ కాంతారావు, ఎఎన్ఎంలు కెంపు రత్నం, చిన పాప, హెచ్‌ఎ తాతారావు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

తాడేపల్లిగూడెం:గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపిడిఒ వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. రామన్నగూడెంలో స్పెషల్ శానిటేషన్ క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల నుంచీ పారిశుధ్య సిబ్బంది, కార్యదర్శులతో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్లపైకి వచ్చిన పిచ్చి మొక్కలను, చెత్తను, సిల్ట్‌తో నిండిన డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామంలోని 10 వార్డుల్లో మెయిన్ రోడ్లు, అంతర్గత రోడ్ల వెంబడి ఉన్న చెత్తను సేకరించి ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఇఒపిఆర్‌డి టి.వెంకటేష్, టిడిపి గ్రామ అధ్యక్షుడు మద్దిపాటి రవితేజ, జనసేన గ్రామ అధ్యక్షుడు బి.నాగరాజు, టిడిపి సీనియర్ నాయకుడు మద్దిపాటి ధర్మేంద్ర పాల్గొన్నారు.

ఆకివీడు :గ్రామాన్ని పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా ఉంచాలని, అందుకు అవసరమైన చర్యలను అధికారులు గ్రామస్తులతో కలిసి చేపట్టాలని డిపిఒ రామనాథరెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని పెదకాపవరం గ్రామాన్ని ఎంపిక చేశారు. శుక్రవారం పెదకాపవరంలో అధికారులు గ్రామస్తులను కలిపి సమన్వయంగా పచ్చదనం పరిశుభ్రత అవసరాలను వివరించారు. డిపిఒ ప్రత్యేకంగా పాల్గొని మాట్లాడారు. అనంతరం డిఎల్‌డిఒ దోశ రెడ్డి, సామర్లకోటలో ప్రత్యేక శిక్షకురాలుగా పనిచేస్తున్న సుశీల, ఎండిఒ బాబూరావు, డిప్యూటీ ఎంపిడిఒ మార్కండేయేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. పెదకాపవరంలో 12 కూడలి ప్రాంతాలను ఎంపిక చేశారు. అక్కడ డ్రెయినేజీలు, రోడ్ల పక్క చెత్తా చెదారాలు సేకరించడం కోసం డస్ట్ బిన్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి బేబీ స్నేత, ఉపసర్పంచి శ్రీనివాసరాజు, పాల్గొన్నారు.

పోడూరు : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మిని మించిలిపాడు సర్పంచి రామన వీర్రాజు అన్నారు. పోడూరు మండలం నుండి ఎంపిక చేయబడిన మిని మించిలిపాడు గ్రామంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు, కూటమి నాయకుల సమక్షంలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇళ్ల నుంచి చెత్తను సేకరించడం, డ్రెయిన్‌లు, రోడ్లు శుభ్రం చేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. డిప్యూటీ మండల అభివృద్ధి అధికారి పడాల నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

గణపవరం:గణపవరం డిగ్రీ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1 ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకూ ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి శుక్రవారం చెప్పారు. వారం రోజులపాటు జరిగే క్యాంపులో గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్, సీజనల్ వ్యాధులపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే సైబర్ సెక్యూరిటీ వయోజన విద్య, బాల్య వివాహాలు, యువతకు విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు గ్రామస్తులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బాధితురాలికి వాకర్స్ క్లబ్ సాయం

పాలకొల్లు :పట్టణంలోని శంభునిపేటకు చెందిన సువ్వాడ శారద ఇటీవల ఇంటి దగ్గర ప్రమాదానికి గురవ్వడంతో తలకు తీవ్ర గాయమైంది. ఆపరేషన్ అనంతరం ఇంటి దగ్గర చికిత్స పొందుతోంది. సాయమందించాలని పలువురు వాకర్స్ క్లబ్‌ను సంప్రదించడంతో స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు క్లబ్ తరపున రూ.12 వేల విలువైన మందులను శుక్రవారం ఆమెకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, జవ్వాజి కళ్యాణ్, గుడాల హరిబాబు పాల్గొన్నారు.

గణపవరంలో ఫ్రైడే డ్రైడే

గణపవరం:గణపవరం నాలుగో సచివాలయ పరిధిలో శుక్రవారం స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కె.ఓంకార్ నాద్ మాట్లాడుతూ తమ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఎల్‌సిడిసి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. సర్వేలో గుర్తించిన వారికి వైద్య పరీక్షలు చేసి శరీరంపై ఉన్న మచ్చలు సాధారణ మచ్చేలేనని చెప్పారు. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, ఎఎన్‌ఎంలు కెజియుఎన్ నాగవేణి పాల్గొన్నారు.

ప్రజా సేవలో త్రిమూర్తులు ముందు

భీమవరం టౌన్: ప్రజాసేవలో కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు ఎప్పుడూ ముందుంటారని కేంద్ర సహాయ మంత్రి సతీమణి భూపతి రాజు వెంకటేశ్వరదేవి ఉన్నారు. శుక్రవారం కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఉమా సోమేశ్వరస్వామి దేవస్థానంలో కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ త్రిమూర్తులు, సతీమణి నాగలక్ష్మితో కలిసి దేవస్థానం పరిసరాల్లోని పేద, అవసరమైన కుటుంబాలకు చీరలు, అల్పాహారం పంపిణీ చేశారు.

కేన్సర్‌పై అవగాహన

భీమవరం టౌన్:భీమవరం ఏరియా ఆసుపత్రిలో ఎన్‌సిడి 4.0 సర్వేలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గీతాబాయ్ మాట్లాడుతూ ఈ సర్వేలో కేన్సర్‌ను ముందుగానే గుర్తించి సరైన వైద్యం అందించొచ్చని తెలిపారు. శుక్రవారం కేన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహన కల్పిస్తూ పెంటపాడు, లంకలకోడేరు, గణపవరం, ముదునూరు పిహెచ్‌సిల ఎంఎల్‌ఎచ్‌పిలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓరల్ కేన్సర్ గురించి డెంటిస్ట్ అబ్దుల్ హమీద్, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్‌పై గైనకాజిస్ట్ డాక్టర్ శివ రంజనీ శిక్షణ ఇచ్చారు. ఆర్‌ఎంఒ డాక్టర్ ప్రవీణ్, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ కెఎంఆర్.కిషోర్, జిల్లా ఎపిడెమాలజిస్ట్ గాతల సుభాష్, భారతి పాల్గొన్నారు.

జుత్తిగలో ధాన్యం కొనుగోలు కేంద్రం

పెనుమంట్ర:రైతులు పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల్లో అమ్మడం ద్వారా సంపూర్ణ లబ్ది పొందాలని జుత్తిగ సొసైటీ ఛైర్మన్ వీరవల్లి రాంబాబు కోరారు. శుక్రవారం జుత్తిగలో రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమన్నారు. అన్నదాత సుఖీభవ రెండో విడత రూ.7000 బ్యాంకు ఖాతాలో జమ చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తమనంపూడి వీరెడ్డి, టిడిపి నాయకులు గొలుగూరి శ్రీనివాస్‌రెడ్డి, వీరవల్లి సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం:విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం హౌసింగ్ బోర్డ్ సబ్ స్టేషన్ పరిధిలోని గణేష్ నగర్, పాతూరు సబ్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మీనగర్ ఫీడర్‌కు సంబంధించి గణేష్ నగర్ ఏరియా, గాంధీ బొమ్మ సెంటర్, కొండాలమ్మ గుడి ఏరియా, వానపల్లిగూడెం, మిలటరీ కాలనీ,గవర్నమెంట్ హాస్పటల్ ఏరియా, గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఏరియా, మహాలక్ష్మి నగర్, సత్యవతి నగర్, టిటిడి కళ్యాణ మండపం రోడ్డు, సత్యవతి నగర్ పిఎన్‌టి కాలనీ, గుణం ఫంక్షన్ హాల్ ఏరియాలకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. నల్లజర్ల రోడ్డు ఏరియా, టీచర్స్ అపార్ట్మెంట్ ఏరియాలకు లైన్ల మరమ్మతుల నిమిత్తం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎలక్ట్రికల్ ఎఇ కె.నరసింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వీరవాసరం:కొణితివాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 22న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎఇ శుక్రవారం తెలిపారు. భీమవరం నుంచి కొణితివాడ సబ్‌స్టేషన్‌కు కొత్త విద్యుత్ లైను వేయడంలో భాగంగా విద్యుత్ సరఫరా నిలుపదల చేస్తున్నట్లు ఎఇ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొణితివాడ సబ్ స్టేషన్ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో కొణితివాడ, ఉత్తరపాలెం, నేల పోగుల గ్రామాలకు కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి సూచించారు.

బిసి నవ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షునిగా సూర్యభాస్కర్

పెనుమంట్ర :బిసి నవ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా మార్టేరు గ్రామానికి చెందిన అల్లాడ సూర్యభాస్కర్‌ను నియమిస్తూ బిసి నవచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు శీలం వెంకటేశ్వర్లు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నియమితులైన అధ్యక్షులు జిల్లా, మండల కమిటీలను సమన్వయం చేసుకుని సంఘాన్ని బలోపేతం చేస్తూ రాష్ట్ర శాఖ ఆదేశాలను పాటిస్తూ సంఘం నియమా నిబంధనలకు కట్టుబడి పని చేయాలని కోరారు. ప్రస్తుతం చేనేత సంఘాల ప్రతినిధిగా ఉన్న అల్లాడ జిల్లాలోని బిసి సంక్షేమం కోసం కృషి చేయాలని పలువురు బిసి సంఘాల ప్రతినిధులు కోరుతూ హర్షం వ్యక్తం చేశారు.

మత్స్య సంపదను కాపాడాలి

నరసాపురం:సముద్రంలో వ్యర్థాలు కలవకుండా మత్స్య సంపదను కాపాడాలని ఎపి మత్స్యకారుల, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జల్లి రామ్మోహన్రావు అన్నారు. శుక్రవారం పిఎంలంకలో మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా మత్స్యకారుల సమస్యలు మాత్రం నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం స్పందించి మత్స్య సంపదను కాపాడాలని డిమాండ్ చేశారు. తిరుమాని వెంకటేశ్వర్లు, రామకృష్ణ, ఏడుకొండలు, శ్రీను, వెంకటేశ్వరరావు, ఏసుబాబు పాల్గొన్నారు.

శీతాకాలం.. ఆరోగ్యం భద్రం..!

ప్రజాశక్తి - కాళ్ల



పెదఅమిరంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉన్ని దుస్తులు,స్వెటర్లు

జిల్లాలో చలి పెరిగింది. పగటి ఉష్ణోగ్రతలు ఎలాగున్నా రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలిలో తేమశాతం పెరిగింది. రాత్రివేళల్లో మంచు కురుస్తోంది. సాయంత్రం నుంచే చలి గాలులు వీస్తున్నాయి. ఇక అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున చలి పులి పంజా విసురుతోంది. ఈ వాతావరణంతో జిల్లావాసులు వణుకుతున్నారు. మారిన వాతావరణ నేపథ్యంలో చలిగాలులకు శరీరం సహకరించకపోవడంతో పలువురు ఇబ్బందులకు గురవుతున్నారు. శీతాకాలంలో ఆస్తమా (ఉబ్బసం) ఉన్నవారు ఊపిరి తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడతారు. ఊపిరితిత్తుల్లోకి గాలి తీసుకెళ్లే శ్వాసకోశ నాళాల లోపల గోడలు ఉబ్బిపోతాయి. అయితే ఈ వ్యాధి పెద్దల్లో కంటే పిల్లల్లోనే ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే వారికి శ్వాస కోస నాళాలు చిన్నవిగా ఉండటమే దానికి కారణం. అయితే పెద్దల నుంచి పిల్లల వరకు అందరూ జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ కాలంలో పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లేటప్పుడు చల్లటి గాలులు వీయడం వల్ల ఈ సమస్య ఎదుర్కొంటారు. శీతాకాలంలో జలుబు, దగ్గు, జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. ముఖ్యంగా ఈ కాలంలో ఎసిలు, కూలర్లకు దూరంగా ఉండాలి. ఆస్తమా వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి. మందులను అందుబాటులో ఉంచుకోవాలి. చలికాలంలో ఇస్నోఫిలియా రోగులు, పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు మరింత జాగ్రత్తగా ఉండాలి. చలిలోగాని, మంచు కురుస్తున్నప్పుడుగాని ప్రయాణాలు చేయకూడదు. మరీ తప్పనిసరి అయితే చలిని తట్టుకునేలా వస్త్రధారణ ఉండాలి. చలిగాలుల్లో ఉండే సూక్ష్మక్రిములు గాలి ద్వారా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇక ఈ కాలంలో వేకువజామున వాకింగ్‌కు వెళ్లడం అంత మంచిది కాదు. తెల్లవారుజామున, రాత్రి వేళ్లల్లో చన్నీళ్ల స్నానం చేయరాదు.

ఆస్తమాకు కారణాలు

పొగ తాగడం, కాలుష్యం, వాతావరణంలో మార్పులు, జలుబు వంటివి ఆస్తమాకు దారితీస్తాయి. తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా కూడా ఈ వ్యాధి రావొచ్చు. అలాగే ఇంట్లో కాలుష్యం, దుమ్ము, దోమల నివారణ మందులు, తలదిండులోని బ్యాక్టీరియా వల్ల కూడా ఆస్తమా వచ్చే అవకాశం ఉంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నందున వారికి తొందరగా ఆస్తమా వచ్చే అవకాశం ఉంది. చలిలో తిరగడం వల్ల న్యూమోనియాతో పాటు ముక్కుకు సంబంధించిన వ్యాధులు, ఎలర్జీ వచ్చే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు చల్లని తినుబండారాలు, ఐస్ క్రీములు, చిరుతిండ్లు, శీతల పానీయాలు తీసుకోకూడదు. ప్రతిరోజూ తేనె, నిమ్మరసం, వేడినీరు తీసుకోవాలి. ప్రతిరోజూ గుడ్లు తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రత సమతుల్యంగా ఉంటుంది. ఉన్ని వస్త్రాలు ధరించకుంటే తలనొప్పి, జలుబు వచ్చే అవకాశం ఉంది. చలికాలంలో గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలి. నూలు వస్త్రాలే ధరించాలి.

ఉపశమనానికి ఉన్ని దుస్తులు

చలి నుంచి బయట పడేందుకు, ఉపశమనం పొందేందుకు మార్కెట్‌లో స్వెట్టర్లు, రగ్గులు, టోపీలు లభ్యమవుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు పట్టణాలు, మండల కేంద్రాల్లో విరివిగా అమ్ముతున్నారు. పల్లెటూళ్లలో శీతాకాల సంప్రదాయమైన ఉదయం నాలుగు గంటల నుంచి మంటలు వేసుకుని చలి కాగుతున్నారు. శీతాకాలంలో తీసుకొనే ఆహారం నుంచి ధరించే దుస్తుల వరకు పలు జాగ్రత్తలు తీసుకోవాని వైద్యులు సూచిస్తున్నారు. చలిలో తిరగడం వల్ల న్యూమోనియాతోపాటు ముక్కుకు సంబంధించిన వ్యాధులు ఎలర్జీ వంటివి వచ్చే అవకాశం ఉంది.

ఈ లక్షణాలుంటే తక్షణం వైద్యుడిని సంప్రదించాలి

సిహెచ్.రంగంనాయుడు, కాళ్ల పిహెచ్‌సి వైద్యాధికారి



జ్వరం, కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, నుదురు వేడిగా ఉండడం, ఊపిరి తీసుకోలేకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి. శీతాకాలంలో చిన్నారుల్లో ఆస్తమా వచ్చే అవకాశం ఉంటుంది. పిల్లలు చల్లని పదార్థాలు తీసుకోకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే ఆస్పత్రిలో పరీక్ష చేయించుకోవాలి.



కొవ్వలిని సత్కరిస్తున్న గ్రామస్తులు

అంగన్‌వాడీ కేంద్రానికి బెంచీలు అందజేత

నరసాపురం:మండలంలోని వేములదీవి పంచాయతీ గొందిమూల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి శుక్రవారం శీలబోయిన సతీష్ సాయంతో పిల్లలకు బెంచీలు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా బహూకరించారు. అనంతరం కొవ్వలి నాయుడుకు సతీష్ పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కొవ్వలి నాయుడు మాట్లాడుతూ ఇటువంటి పనులు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అదేవిధంగా యువత తమ పరిసరాల్లోని సమస్యలపై స్పందించి సేవా భావంతో పాల్గొంటే గ్రామాభివృద్ధితో పాటు నియోజకవర్గం కూడా అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలా జయరాం, మైలా అమ్మన్న, నంద్యాల హనుమంతు, కౌరు శ్రీను దేవి రెడ్డి రామచంద్రరావు, సంకు భాస్కర్ నాయుడు, నంద్యాల బాబు, యర్రంశెట్టి వేణు, కొవ్వలి ఫాలోవర్స్ పాల్గొన్నారు.

కొనసాగిన కోటి సంతకాల సేకరణ

పెనుమంట్ర:మాజీ మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆదేశానుసారం మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పెనుమంట్రలో గడిచిన మూడు రోజులుగా సాగుతోందని సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు తెలిపారు. స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజల స్పందన ప్రభుత్వానికి తెలియపర్చే విధంగా సంతకాలు సేకరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గండి రాము, దొంగ నరసింహమూర్తి, మేడపాటి కృష్ణమూర్తి, మార్లపూడి ఆనంద్, సురగాల రవి తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయునికి పరకాల ట్రస్ట్ సాయం

పోడూరు:వేడంగి గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు కొట్టి రామం వైద్య నిమిత్తం కవిటం పరకాల ట్రస్ట్ శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసింది. సీనియర్ పాత్రికేయుడు రామానికి నెల రోజుల క్రితం ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయంతో ప్రాణాపాయ పరిస్థితి నుండి కోలుకుని ఇటీవలే ఆయన విజయవాడ ఆస్పత్రి నుంచి తన నివాసానికి వచ్చారు. పరకాల ట్రస్ట్ పది వేలు సాయం అందించడం పట్ల రాము, ఆయన తనయుడు కొట్టి నవీన్ వారి కుటుంబ సభ్యులు ట్రస్ట్ ఛైర్మన్ పరకాల సూర్యమోహన్, పరకాల రమేష్, రాజేశ్వరరావు, రథాంగఫణికి కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

మొగల్తూరు:జగన్నాథపురం పంచాయతీ దారుతిప్పలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం తమ సిబ్బందితో కలిసి దాడి చేశామని ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపారు. ఈ దాడిలో 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.25,660 నగదు, 112 కాయిన్లు స్వాధీనం చేసుకున్నామని నాగలక్ష్మి తెలిపారు.

రాజ్యాంగం గొప్పతనం పౌరులకు తెలియాలి

భీమవరం టౌన్:భారత రాజ్యాంగం గొప్పతనం భావి భారత పౌరులైన విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో స్కూలు, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, న్యాయ కళాశాలల విద్యార్థులకు ఆయా పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలతో 'భారత రాజ్యాంగం-సామాజిక బాధ్యత' అంశంపై వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీ పరీక్షలు నిర్వహించడం జరిగిందనీ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 26న విష్ణు ఇంజినీరింగ్ కాలేజీలో మెమోంటో, సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల గురించి డిసెంబరు 13 జాతీయ లోక్ అదాలత్ లో కేసుల రాజీకి తీసుకుంటున్న చర్యలపై శుక్రవారం న్యాయమూర్తి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు, 1వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పిపి.హనీష, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎన్.జ్యోతి పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి సేవలు ఆదర్శనీయం

తణుకు:సత్యసాయి సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయంగా తీసుకోవాలని ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని తణుకు ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సత్యసాయి ప్రవచనాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా నిత్యాన్నదాన వితరణ సేవా కేంద్రాన్ని ప్రారంభించి 2017 నుంచి నిరంతరాయంగా అన్నదాన వితరణ కొనసాగించడం అభినందనీయమన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్టూడెంట్ ఎంఎల్‌ఎగా దేవ హైస్కూల్ విద్యార్థిని సరిత



విద్యార్థిని సరితను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

పెనుగొండ రూరల్:భారత రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో భాగంగా దేవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కోడెల్లి సరిత ఆచంట నియోజకవర్గ స్టూడెంట్ ఎంఎల్‌ఎగా ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సత్య ప్రియరామ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ విద్యను అభ్యసించినట్లయితే ఏదైనా సాధించగలరన్నారు. నియోజకవర్గ స్థాయిలో స్టూడెంట్ ఎంఎల్‌ఎగా దేవ హైస్కూల్ నుండి ఎన్నిక కావడం, 26న జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఆచంట నియోజకవర్గం తరపున పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నల్లూరి సత్యనారాయణ, వెలిచేటి బాబు రాజేంద్రప్రసాద్, మన్నె శ్రీహరి విశ్వేశ్వర, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

థియేటర్‌లో జెసి తనిఖీ

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రేక్షకులకు థియే టర్‌లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని యాజమాన్యానికి జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి సూచించారు. మొగల్తూరులోని శ్రీదేవి జానకి థియేటర్స్‌ను ఇటీవల మరొకరు కొనుగోలు చేయడంతో నూతన యాజమాన్యం పేరు మార్పు చేస్తూ లైసెన్స్ కోసం దరఖాస్తు చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం తహశీల్దార్ కె.రాజ కిషోర్‌తో కలిసి జెసి థియేటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతన యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. టాయిలెట్లు తెలియపరుస్తూ బోర్డులు, ప్రేక్షకులకు తాగునీరు, థియేటర్లో అగ్నిమాపక యంత్రాలను 8 ఉన్నాయని తెలిపారు. అదనంగా మరో ఎనిమిది అగ్నిమాపక యంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రేక్షకులకు తెలిసే విధంగా బయటికి వెళ్లే మార్గాలు తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే తహశీల్దార్ తనిఖీ చేసి నివేదిక తనకు అందజేస్తారని తెలిపారు. అనంతరం లైసెన్స్ మంజూరు చేస్తామన్నారు. వారి వెంట విఆర్‌ఒలు దుసనపూడి సత్యనారాయణ, ముచ్చర్ల నిరంజన్, సిబ్బంది ఉన్నారు.

సంక్షేమంలో పాలకొల్లు మందంజ : మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ కమిటీ సమావేశంలో నియోజకవర్గ సమావేశానికి మించి హాజరయ్యారంటే కార్యకర్తల స్పందన ఎలా ఉందో అర్థమవుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో టిడిపికి తిరుగు లేదని అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రంలోనే ముందుందని తెలిపారు. టిడిపి పట్టణ అధ్యక్షుడిగా తిరిగి జివి, ప్రధాన కార్యదర్శిగా వల్లభు నారాయణ మూర్తి ఇతర కార్యవర్గం శుక్రవారం రాత్రి లయన్స్ కమ్యూనిటీ హాల్లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేశారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఎఎంసి ఛైర్మన్ కోడి విజయ్‌భాస్కర్, టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరునాయుడు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో సెమినార్

ప్రజాశక్తి - పాలకొల్లు

డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన సెమినార్‌లో విజయవాడ రిజర్వు బ్యాంకు (హెచ్ఆర్) నాగరాజు ఆయన బృందం పాల్గొన్నారు. ఆర్‌బిఐ, డిజిటల్ బ్యాంకింగ్ విధానంలో దేశ ఆర్థిక వ్యవస్థను ఏవిధంగా ముందుకు తీసుకెళ్తోంది, ఆర్థిక సైబర్ క్రైమ్స్‌ను ఏ విధంగా అరికట్టాలనే అంశాలపై అవగాహన ఉంటుందని చెప్పారు. ఆర్‌బిఐలో గ్రూప్-బి స్థాయి ఉద్యోగాల్లో మహిళలకు ఎక్కువ అవకాశాలున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరమూ జూన్, డిసెంబర్ మధ్యలో నోటిఫికేషన్ వస్తుందని చెప్పారు. ప్రిలిమినరీ, మెయిన్స్ అని రెండించెలలో పరీక్షలు ఉంటాయని విద్యార్థినులు తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు. ఆర్‌బిఐ తరపున విద్యార్థినులకు కరదీపికలు, కొన్ని బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ శోభారాణి అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపల్ సి.రవిశంకర్, కుమారి శైలజ, ప్రసన్న, జూలియా అధ్యాపక బృందం పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - నరసాపురం

డిసెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సమన్యాయం అందించే దిశగా న్యాయవాదులు సహకరించాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్ పర్సన్ ఎ.వాసంతి అన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. క్రిమినల్ కేసులతో పాటు ప్రామిస్సరీ నోట్, ఎగ్జిక్యూషన్ పిటిషన్లు, చెక్ బౌన్స్, భూ తగాదాలు, కుటుంబ తగాదాలు వంటి కేసుల్లో ఇరు పార్టీలను సమన్వయ పర్చి లోక్‌అదాలత్ ముఖ్యోద్దేశాన్ని వివరించి సాధ్యమైనంత వరకూ కేసులు పరిష్కారం అయ్యేలా ప్రయత్నించాలన్నారు. లోక్ అదాలత్‌లో న్యాయవాదులు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతిరోజూ కోర్టులో జరుగుతున్న మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వి.నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ వి.సూర్యప్రకాశరావు, ట్రెజరర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారదర్శకంగా రీసర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి - ఉండి

ఉండిలో రీసర్వేను పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా చూడాలని జిల్లా సర్వేయర్ కె.జాషువా అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో సర్వే సిబ్బందికి రీసర్వేపై అవగాహన కల్పించి సర్వే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో మాట్లాడి సకాలంలో వారి భూములు రీసర్వే చేసి సరిహద్దుల ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలన్నారు. జాయింట్ ఎల్‌పి నెంబర్లు లేకుండా విడివిడిగా నెంబర్లు ఇచ్చే విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే మల్లికార్జునరావు, తహశీల్దార్ కావడి నాగార్జున, విఆర్‌ఒలు బాబి, మేరీ, గొల్లమ్మ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు చంద్రశేఖర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆలిండియా సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి యోగా పోటీలకు మోదుగగుంట హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ ఎంపికయ్యారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి యోగా పోటీలు శుక్రవారం విజయవాడ స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీల్లో మోదుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ యోగాసన పోటీల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

ఆక్వా రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఆక్వా రైతులు ఆధునిక పద్ధతులు ఉపయోగించి సాగు చేస్తే మంచి దిగుబడి సాధించొచ్చని ఆక్వా యూనివర్శిటీ ఒఎస్‌డి టి.సుగుణ అన్నారు. లక్ష్మణేశ్వరం మత్స్య కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న రొయ్యల సాగు వ్యాధులు, యాజమాన్యం అంశంపై మూడు రోజుల పాటు జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఒఎస్‌డి సుగుణ మాట్లాడుతూ ఆక్వా రైతులు యాంటీబయోటిక్ మందులకు దూరంగా ఉండాలన్నారు. ల్యాబ్ పరీక్షలు, రొయ్య, చెరువుల ఎంపిక కీలకమన్నారు. శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు చేయాలని పిలుపునిచ్చారు. రైతులు ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని తమ చెరువులో అమలు చేస్తామని, ఇటువంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ మాధవి, ప్రొఫెసర్లు వీరభద్రరావు, శ్రావణి పాల్గొన్నారు.

గ్రామంలో స్వచ్ఛత కొనసాగించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామంలో స్వచ్ఛత కొనసాగించాలని డివిజన్ పంచాయతీ అధికారి ఐ.జ్యోతిర్మయి, డిఎల్‌డిఒ రాణి సూచించారు. రామన్నపాలెంలో శుక్రవారం స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పంచాయతీ కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్లు పారిశుధ్య కార్మికులతో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చెత్త సేకరించి సంపద కేంద్రానికి తరలించారు. అనంతరం ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు పలు సూచనలు చేశారు. గ్రీన్ అంబాసిడర్ల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపిడిఒ ఎం.సత్యనారాయణ, కార్యదర్శులు ముచ్చర్ల నాగేశ్వరరావు, బి.కృష్ణప్రసాద్, సర్పంచి ఎలీషా పాల్గొన్నారు.